ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 29 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# పెద్దపులి దాడిలో యువతి మృతి

**ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్ నగర్ మండలంలో ఘటన**

ఆసిఫాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులులు బెంబేలెత్తిస్తున్నాయి. గతంలో పలు సంఘటనలు చోటుచేసుకోగా..తాజాగా ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్ నగర్ మండలం గన్నారం అటవీ ప్రాంతంలో పెద్దపులి యువతిపై దాడి చేసింది. చేలో పత్తి తీయడానికి వెళ్లిన అదే గ్రామానికి చెందిన లక్ష్మీపై దాడి చేసి పట్టుకునే వెళ్లేందుకు యత్నించింది. అక్కడే ఉన్న కూలీలు కేకలు వేయడంతో వదిలేసి పెద్దపులి పారిపోయింది. తీవ్ర గాయాలైన యువతిని కాగజ్ నగర్ తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి చనిపోయింది. లక్ష్మీ మృతదేహాన్ని తీసుకొని గ్రామస్తులు అటవీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలంటూ బంధువులు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా పులుల సంచారం ఉందని తెలిసినా అటవీ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.



# ఇవిగో పత్రాలు

**ఇథనల్‌కు అనుమతులిచ్చింది బీఆర్ఎస్‌యే**

**పర్యావరణ శాఖ పర్మిషన్ల ఉల్లంఘన**

**ఇథనల్, ఇతర ఉత్పత్తులకు ఎల్ఓసీ జారీ**

**పత్రాలు రిలీజ్ చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథలాల్ కంపెనీకి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులు మంజూరు చేశారంటూ పలు పత్రాలను విడుదల చేసింది. ''ఇథనాల్ కంపెనీకి బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. పర్యావరణ శాఖ పర్మిషన్లను ఉల్లంఘించి నిబంధనలను తుంగలో తొక్కారు. కేంద్ర ప్రభుత్వం ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ అనుమతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తులకు అప్పటి మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో కంపెనీకి అనుకూలంగా పర్మిషన్లు ఇచ్చారు. మినహాయింపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ అడ్డదారులు అనుసరించింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం స్థానిక సంస్థలు ఎన్‌వోసీ తీసుకోవాలి. అలా చేయకుండానే పీఎంకే డిస్టిలేషన్స్ కాంపౌండ్ వాల్ నిర్మించింది. భారాస ప్రభుత్వ అండతో పీఎంకే డిస్టిలేషన్స్ నిబంధనలు ఉల్లంఘించింది. 2022 అక్టోబర్ 22న గత ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ చేసింది. 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఇతర ఉత్పత్తుల కోసం గత ప్రభుత్వం ఎల్‌వోఐ జారీ చేసింది'' అని ప్రభుత్వం పేర్కొంది.

# నరేందర్ రెడ్డికి ఊరట

**మూడు ఎఫ్ఐఆర్లో రెండు కొట్టేసిన హైకోర్టు**

హైదరాబాద్ : పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. మూడు ఎఫ్ఐఆర్లో లో రెండు ఎఫ్ఐఆర్ లను ధర్మాసనం కొట్టేసింది. ఆ మూటిండిపై హైకోర్టును ఆశ్రయించారు నరేందర్. నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేశారంటూ ఆరోపించారు. ఒకే ఘటనపై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడంపై పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్ ల్యాయర్ తో ధర్మాసనం ఏకీభవించింది. మూడింటిలో రెండింటిని కొట్టేయాలని ఆదేశించింది.





# రాజకీయ శరణార్థిగా గుర్తించండి

**అమెరికా ప్రభుత్వానికి ప్రభాకర్ రావు విజ్ఞప్తి**

**తెలంగాణ ప్రభుత్వంలో కీలకంగా పనిచేశానని వెల్లడి**

**రాజకీయంగా కాంగ్రెస్ సర్కారు వేధిస్తోంది**

**తీవ్ర అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నానన్న మాజీ పోలీస్ అధికారి**

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అమెరికా ప్రభుత్వానికి ప్రభాకర్ రావు విన్నవించారు. తెలంగాణ ప్రభుత్వంలో కీలక స్థానంలో పనిచేశానని పేర్కొన్నారు. రాజకీయంగా తనను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని మాజీ పోలీసు అధికారి తెలిపారు. తీవ్ర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నానని ప్రస్తుతం ఫ్లోరిడాలోని తన కుమారుడి వద్ద ఉంటున్నానని వివరించారు. మరో వైపు అమెరికాలో తలదాచుకుంటున్న ఆయన్ను ఇండియాకు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటర్ పోల్ ద్వారా రెడ్ నోటీసులు జారీ చేయించేందుకు యత్నిస్తున్నారు. ఛానల్ ఎండీ శ్రవణ్ రావు చికాకోలో ఉన్నట్లు తేలింది. అక్కడి అడ్రస్ ను పోలీసులు కనుగొన్నారు.

# డిసెంబర్ లో కీర్తిసురేశ్ పెళ్లి

**స్వయంగా వెల్లడించిన నటీ**

సినిమా : నటి కీర్తిసురేశ్ పెళ్లి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెలలోనే ఆమె వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం స్వయంగా వెల్లడించారు. కీర్తి తన కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెళ్లి ముచ్చట బయటపెట్టారు. వచ్చే నెలలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలిపారు. గోవాలో వెడ్డింగ్ జరుగుతుందన్నారు. ఇక, తాను నటిస్తున్న హిందీ సినిమా కూడా వచ్చే నెలలో విడుదల కానుందని, అందుకే స్వామివారి దర్శనం కోసం వచ్చానని తెలిపారు.



# తెలంగాణ ప్రజలు నా కుటుంబసభ్యులు

**నటుడు సోనూసూద్**

పంజాబ్ లో పుట్టిపెరిగినా కూడా తెలంగాణ ప్రజలను తన కుటుంబ సభ్యులలాగా భావిస్తానని ప్రముఖ నటుడు సోనూసూద్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని పాలమాకుల గ్రామంలో శుక్రవారం నాడు సందడి చేశారు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ, సెల్ఫీలు దిగుతూ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలను తన సొంత నిధులతో అభివృద్ధి చేసిన సిద్ధూ రెడ్డిని సోనూసూద్ అభినందించారు. సిద్ధూరెడ్డి తన సోదరుడిలాంటి వాడని, స్కూలును అభివృద్ధి చేయడం గర్వంగా ఉందని అన్నారు.



# సోనియా లేకుంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చేదా ?



**మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రజలు కృతజ్ఞతతో ఉండాలి**

**బీఆర్ఎస్ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు**

**పీఎం వ్యాఖ్యలను బీజేపీ నేతలు ఎందుక ఖండించడం లేదని ఆగ్రహం**

హనుమకొండ : తెలంగాణ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో సోనియాగాంధీ లేకుంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చేదా? అనే విషయాన్ని దీక్ష దివాస్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గుట్టపైకి మెట్ల దారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని వసతిగృహాల్లో ఆహారం కలుషితం కాకుండా చూసేందుకు ఫుడ్ సేఫ్టీ కమిటీ వేశామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కల సాకారం చేసిన సోనియాగాంధీ పట్ల రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కృతజ్ఞతతో ఉండాలన్నారు. తెలంగాణ ఏర్పాటును కించపరుస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్యలను రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు